సాక్షి
వనపర్తి
సోమవారం । 27 । జనవరి । 2025



పథకాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

అర్హులందరికీ సంక్షేమం

- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ఆదర్శ్ సురభి
- జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఘనంగా వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- స్వాతంత్య్ర సమరయోధులు, తెలంగాణా అమరవీరుల కుటుంబాలకు సన్మానం

'సమాజంలోని అన్నివర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే మహాలక్ష్మి, గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రూ.రెండు లక్షల పంట రుణమాఫీ పథకాలు అమలవగా.. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.
- ఆదర్శ్ సురభి, కలెక్టర్


జాతీయజెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగిన 76వ గణతంత్ర వేడుకలకు ఆయన హాజరై అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎస్పీ రావుల గిరిధర్, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి ప్రగతి నివేదిక చదివి వినిపించారు. 2023, డిసెంబర్ 9న ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు జిల్లాలో సుమారు 1.59 కోట్ల మంది ప్రయాణించి రూ.64.79 కోట్లు లబ్ధి పొందినట్లు చెప్పారు.

అలాగే రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందించే కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తుందని.. ఈ పథకంతో జిల్లాలో 82,933 మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో 8,313 మంది ఉచిత వైద్యసేవలు పొందేందుకు రూ.19.40 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు.


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ



వేదికపై కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు తదితరులు

60,545 మందికి పంట రుణమాఫీ..

జిల్లాలో ఇప్పటి వరకు 60,545 మంది రైతులకు రూ.రెండు లక్షల పంట రుణమాఫీ వర్తించిందని.. ఇందుకోసం ప్రభుత్వం రూ.480.91 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. 268 మంది రైతులకు రైతుబీమా వర్తించిందని.. రూ.13.40 కోట్లు వారి కుటుంబ సభ్యుల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. అదేవిధంగా రైతుభరోసా పథకం కింద ఎకరానికి ఏడాదికి రూ.12 వేలు పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. జిల్లాలోని 14 మండలాల్లో వ్యవసాయ యోగ్యంకాని భూములను గుర్తించడానికి 10 రోజుల పాటు గ్రామాల్లో సర్వే నిర్వహించామని.. 4,345 ఎకరాలను గుర్తించినట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వానికి ఏటా రూ.5.21 కోట్ల ఆర్థిక భారం తగ్గుతుందన్నారు.

■ సన్నరకం వరికి మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను వానాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు చెల్లించామని.. ఇప్పటి వరకు జిల్లాలో 21,690 మంది రైతుల ఖాతాల్లో రూ.27.22 కోట్లు జమ చేశామని చెప్పారు.

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు..

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 గృహాలు కేటాయిస్తామని.. పేదలు సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.42 లక్షల ఇళ్ల సర్వే చేశామని తెలిపారు.

గృహజ్యోతి పథకం..
జిల్లాలోని 80,142 మంది విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకం అమలైందని.. ఈ పథకం కింద ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.14.11 కోట్లు సంస్థకు చెల్లించిందని వివరించారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా..
భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం'తో ఏడాదికి రూ.12 వేలు అందించనున్నట్లు తెలిపారు. చేయూత పథకంలో భాగంగా వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, బీడీ, కార్మికులు, బోదకాలు, డయాలసిస్, ఒంటరి మహిళలకు నెలకు రూ.2,016, వికలాంగులకు రూ.4,016 పింఛన్ చెల్లిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 1.57 లక్షల రేషన్‌కార్డులకు ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నామని.. త్వరలో కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు వివరించారు.

వైద్యరంగంలో..

అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేట్‌కు దీటుగా వసతులు కల్పించామని, వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం పెరిగిందని, ప్రసవాల సంఖ్య కూడా పెరిగిందని వివరించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మిషన్ మధుమేహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని.. మొదట 5 పీహెచ్‌సీల్లో 30 ఏళ్లు దాటిన 58,127 మందికి ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించి నిర్ధారణ అయిన 3,300 మందికి ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రికి 50 బెడ్లతో క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరైందని, జీజీహెచ్, ఎంసీహెచ్‌లో నూతనంగా లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 330 పడకల ఆస్పత్రిని 530 పడకల ఆస్పత్రిగా మారుస్తున్నామన్నారు.

కంట్రోల్‌రూం ఏర్పాటు..

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటుచేసి అన్ని మండలాల్లో ఉన్న 731 సీసీ కెమెరాలను అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. షీటీమ్‌లతో మహిళల రక్షణకు భరోసా కల్పిస్తున్నామని.. సైబర్ నేరాల కట్టడికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

■ జిల్లాకేంద్రంలో మహిళా ఉద్యోగినుల వసతి గృహాన్ని ప్రారంభించామన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల స్థితిగతులను తెలుసుకునేందుకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలను శాలువాలతో సత్కరించారు. అలాగే జిల్లాలోని 2,646 మహిళా సంఘాలకు రూ.246 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యారంగంలో..

జిల్లాలోని 333 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో అభివృద్ధి చేశామని.. ఇందు కోసం రూ.13.18 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. వసతిగృహ విద్యార్థులకు 50 శాతం డైట్ చార్జీలు, 215 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచినట్లు గుర్తు చేశారు.

పదేళ్లలో 'పాలమూరు' పూర్తి చేశారా?


ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- 'పేట- కొడంగల్' ప్రాజెక్టుకు టెంకాయ కొట్టలేకపోయారు
- కేసీఆర్, కేటీఆర్‌లకు సంపదలపై ఉన్నధ్యాస ప్రాజెక్టులపై లేదు
- కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే సీఎం అయ్యా
- 20 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- పరిశ్రమలు నెలకొల్పుతుంటే రాజకీయం చేశారు
- చంద్రవంచలో నూతన పథకాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే..

మీ అందరికీ తెలుసు 2023 వరకు కొడంగల్ నియోజకవర్గం ఎవరు అధికారంలో ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా న్యాయం మాత్రం జరగలేదు.. 2023 డిసెంబర్ ఎన్నికల్లో పెద్దలు గుర్నాథరెడ్డి, ప్రజలందరూ ఆలోచించి ఈసారి కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని.. ఆ ప్రభుత్వం నాయకత్వం వహించాలని కష్టపడి అత్యధిక మెజార్టీతో నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు తనను ముఖ్యమంత్రిగా నియమించడం కొడంగల్ ప్రజల ఆశీర్వాదమే అని రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక కొడంగల్‌కు ఎక్కువ సమయం ఇవ్వలేకపోతున్నానని, కానీ 4 కోట్ల రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం శ్రమిస్తూనే కొడంగల్ అభివృద్ధికి పాటు పడుతున్నానన్నారు. నాలుగు కొత్త పథకాలు కొడంగల్ నియోజకవర్గం నుంచే ప్రారంభమయ్యాయంటే ఎంతో గౌరవంగా ఉందన్నారు.

నారాయణపేట/ కోస్గి: 'పదేళ్ల అధికారంలో ఉండి పాలమూరు- రంగారెడ్డి పూర్తి చేయలేకపోయారు. కనీసం నారాయణపేట- కొడంగల్ ప్రాజెక్టుకు టెంకాయ కొట్టలేదు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయొద్దన్నమా..? సంపదలపైన ఉన్న ధ్యాస కేసీఆర్, కేటీఆర్‌కు ప్రాజెక్టులపై లేకపాయె. ఈ ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా..రాష్ట్రంలో వారి రాజకీయ మనుగడ ఉండదనే ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా రాజకీయం చేస్తూ అడ్డుకుంటున్నారు.. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి.. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ పథకాలను తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం చంద్రవంచలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు సీఎం కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిగి, నారాయణపేట ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ మిత్రులారా ఇందిరమ్మ రాజ్యం.. ప్రజాపరిపాలనలో మనం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని 13 నెలలు పూర్తి కావొస్తుంది. ఈ క్రమంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాలుగు గ్యారంటీలు రైతుభరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నాం.. ఇందుకు వేదికైన కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలంలోని చంద్రవంచ గ్రామాన్ని రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారన్నారు.


సభకు హాజరైన కొడంగల్ నియోజకవర్గ ప్రజలు

ఆధార్ మాదిరిగానే రేషన్‌కార్డు

ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఎలాగో.. పేదలకు రేషన్ కార్డు అలాగే అని సీఎం పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు వచ్చిందా అంటూ కేసీఆర్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కేసీఆర్.. అమెరికాలో కంప్యూటర్ చదువులు చదివిన కేటీఆర్‌కు పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలన్నా సోయి ఎందుకు రాలేదని దుయ్యబట్టారు. రేషన్ కార్డులను అర్హులైన ప్రతి కుటుంబానికి అందజేస్తూ.. ఫిబ్రవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

అధికారులు ఎప్పుడైనా వచ్చారా..

గత ప్రభుత్వ పదేళ్ల హయాంలో అధికారులు ఎప్పుడైనా గ్రామాల వైపు చూశారా అని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడాదిలో మూడుసార్లు గ్రామసభలు నిర్వహిస్తూ గ్రామ కార్యదర్శి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వరకు ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు.

పరిశ్రమలు తెస్తే అడ్డుకున్నారు..

పరిశ్రమలు తేవాలని కొడంగల్ నియోజకవర్గంలో 1,300 ఎకరాల భూసేకరణ చేస్తే రాజకీయం చేస్తూ అధికారులపై దాడులకు పాల్పడ్డారని సీఎం ధ్వజమెత్తారు. వెనకబడిన ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పితే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పెట్టుబడులు తీసుకువస్తుంటే అడ్డుకున్నారన్నారు. ఎప్పటికీ మనం వెనకబడే ఉండాలా..? కొడంగల్ యువకులు ఇంకా లుంగీలు కట్టుకొని బస్టాండ్లలో తిరగాలా..? కొడంగల్‌కు మెడికల్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీలు రావొద్దా..? అని ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన మనుషులు కొడంగల్ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సొంతంగా రూ.కోట్లు వెచ్చించానని, కోస్గి బస్టాండ్ నిర్మాణానికి తన సొంత స్థలం ఇచ్చానని గుర్తు చేశారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి నాలుగు పథకాలు రాష్ట్రానికి అంకితం ఇస్తున్నాం.. ప్రతి లబ్ధిదారుడికి మార్చి 31 నాటికి పథకాలన్నీ అందుతాయి.. వలస పోయిన కుటుంబాలు కూడా సొంతూరులో రేషన్‌కార్డులు తీసుకోవాలని సీఎం కోరారు. నిండు మనసుతో కొడంగల్ ప్రజలు అండగా నిలబడితే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. దేళ్లలోపు కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుదామని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మన మాట.. మన బాట.. అభివృద్ధి, సంక్షేమమే అని సీఎం పునరుద్ఘాటించారు.

■ సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా నాలుగు కొత్త పథకాలను చంద్రవంచలో ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకాలు నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుల వరకు పథకాలు అందజేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,800 గ్రామసభలు, 3,485 వార్డు సభలు విజయవంతంగా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ బేన్ షాలమ్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏడీ విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్డీఓ రామచంద్ర, గ్రంథాలయ చైర్మన్ విజయకుమార్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కోస్గి మండలాధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పురపాలికల ప్రత్యేక అధికారిగా సంచిత్ గంగ్వార్

వనపర్తి: పుర పాలకవర్గాల పదవీకాలం ఆదివారంతో ముగిసింది. కొత్త పాలకవర్గాలు కొలువుదీరే వరకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. జిల్లాలోని వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు, అమరచింత, ఆత్మకూర్ పురపాలికలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం నుంచి ఆయన బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

కాంగ్రెస్ పాలనతోనే పేదలకు మేలు


లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ నాలుగు సంక్షేమ పథకాలు అందుతాయని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఒకేసారి అమలు చేస్తున్న నాలుగు పథకాలను ఆదివారం మండలంలోని అప్పాయిపల్లిలో కలెక్టర్ ఆదర్శ సురభితో కలిసి ప్రారంభించారు. సమావేశం ప్రారంభంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని భారీ తెరపై ప్రదర్శించారు. అనంతరం 118 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 40 మందికి కొత్త రేషన్ కార్డులు, 27 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 559 మంది రైతులకు రైతు భరోసా పథకాల ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పల్లెల్లో ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు మేలు చేకూరుతుందని, పార్టీలకతీతంగా పథకాల అమలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ రవీందర్ బాబు, ఏఓ కురుమయ్య, వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి ,శంకర్‌నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్యయాదవ్, ఆర్‌ఐలు మధుసూదన్, వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ పరమేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా..

వనపర్తి టౌన్: జిల్లాకేంద్రంలోని వివిధ శాఖల కార్యాలయాలపై ఆదివారం జాతీయ జెండా రెపరెపలాడింది. సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా పోలీసు కార్యాలయంపై ఎస్పీ రావుల గిరిధర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఆర్డీఓ కార్యాలయంపై ఆర్డీఓ సుబ్రమణ్యం, ఆర్‌అండ్‌బీ డివిజన్ కార్యాలయంపై డీఈ సీతారాములు, విద్యుత్ సర్కిల్ కార్యాలయంపై ఎస్‌ఈ రాజశేఖర్, డివిజనల్ కార్యాలయంలో డీఈ శ్రీనివాస్, పట్టణ విద్యుత్ కార్యాలయంలో ఏఈ రాజయ్యగౌడ్, వనపర్తి తపాలా కార్యాలయంపై ప్రధాన పోస్టల్ సూపరింటెండెంట్ భూమన్న జాతీయ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా పుర కార్యాలయంపై కమిషనర్ పూర్ణచందర్‌రావు పతాకావిష్కరణ చేయగా చైర్మన్ మహేశ్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, మాజీ చైర్మన్లు రమేష్‌గౌడ్, గట్టుయాదవ్ పాల్గొన్నారు


జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎస్పీరావుల గిరిధర్, సిబ్బంది

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

వనపర్తి: గణతంత్ర వేడుకల్లో వివిధ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. జానపద, దేశభక్తి, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేలా చేసిన నృత్యాలు అధికారులు, ప్రజాప్రతినిధులను కనువిందు చేశాయి. గణతంత్ర వేడుకల సందర్భంగా యువకులు జాతీయ జెండాలతో పట్టణ వీధులు, ప్రధాన కూడళ్ల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణల్లో పలువురు విద్యార్థులు కనిపించారు.


దేశభక్తి గీతానికి నృత్యం చేస్తూ..

నేపాల్ టి-20కి గోపాల్‌పేట వాసి ఎంపిక


కేబీ ప్రభాకర్

గోపాల్‌పేట: మండల కేంద్రానికి చెందిన కేబీ ప్రభాకర్ బోర్డ్ ఆఫ్ డిసేబుల్ క్రికెట్ అసోసియేషన్ తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడేందుకు ఎంపికయ్యారు. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రాంరెడ్డి నుంచి తనకు సమాచారం వచ్చిందని ప్రభాకర్ తెలిపారు. ఫిబ్రవరి 14 నుండి 18 వరకు నేపాల్‌లో మూడు టి-20, రెండు వన్డే మ్యాచ్‌లు జరుగుతాయని.. తనకు జట్టులో స్థానం లభించడం సంతోషంగా ఉందన్నారు. గతంలోనూ తెలంగాణ తరఫున ఆడానని వివరించారు. ఈ సందర్భంగా కేబీ ప్రభాకర్‌ను స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు.


పాలమూరు పరేడ్ మైదానంలో..


మహబూబ్‌నగర్‌లో గ్రామదేవత వేషధారణలో..


గద్వాలలో గిరిజన వేషధారణలో..

జయహో..



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. ఊరూవాడ త్రివర్ణ శోభితంగా మారాయి. దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పలువురు తమ విన్యాసాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. జాతీయ పతాకం చేతబూని జయహో భారత్ అంటూ విన్యాసాలను ప్రదర్శించారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిపై ఏర్పాటుచేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో వివిధ శాఖల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

- సాక్షి నెట్‌వర్క్


మహబూబ్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై శకటం ప్రదర్శన



గద్వాలలో ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలంటూ..


మహబూబ్‌నగర్‌లో..


వనపర్తిలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ..


మహబూబ్‌నగర్‌లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపై ఏర్పాటుచేసిన శకటం


పాలమూరులో సంప్రదాయ నృత్య ప్రదర్శన

ఇక్కడ విధులు నిర్వహించడం గర్వంగా ఉంది


- శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రం సీఈ రామసుబ్బారెడ్డి

దోమలపెంట: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వహించడం గర్వంగా ఉందని సీఈ రామసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈగలపెంటలోని శక్తిసదన్ కార్యాలయం వద్ద ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భూగర్భ కేంద్రం జెన్‌కో యాజమాన్యం ఇచ్చిన టార్గెట్ 2,000 యూనిట్లను అధిగమించి ఉత్పత్తి చేశామన్నారు. ఇంకా లోడ్ డిస్పాచ్ అడిగిన వెంటనే విద్యుత్తు ఉత్పత్తి సరఫరాకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఆణిముత్యం లాంటి కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో ఈ ఏడాది గణనీయంగా సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం జలాశయంలోకి నీటిని తరలించామన్నారు. యాజమాన్యం ఇటీవల కేంద్రంకు ముప్పై మంది నూతన ఏఈలను కేటాయించిందని తెలిపారు. ఎస్‌ఈ(ఓఅండ్ఎం) ఆదినారాయణ, కేంద్రం యావత్తు ఇంజినీర్లు ఉద్యోగులు పాల్గొన్నారు. తదుపరి ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ రవి పర్యవేక్షణలో ఎస్‌ఐలు అనూప్, శ్రావణ్, పోలీసుల నుంచి వందన స్వీకరించారు.


ఈగలపెంటలో శక్తిసదన్ వద్ద గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఈ రామసుబ్బారెడ్డి

మహనీయుల త్యాగాలు మరవద్దు

- పదోపటాలం కమాండెంట్ ఎన్‌వీ సాంబయ్య


గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ సాంబయ్య

ఎర్రవల్లి: ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగానే ఈరోజు మనమంతా స్వతంత్రంగా జీవిస్తున్నామని.. అలాంటి వారిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పదో పటాలం కమాండెంట్ ఎన్‌వీ సాంబయ్య కోరారు. ఆదివారం ఎర్రవల్లి మండలం బీచుపల్లి పదోపటాలంలో జరిగిన 76వ గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినందున గణతంత్ర దినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం కన్న కలలను సాకారం చేసేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం పటాలంలోని వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన విశ్రాంత సిబ్బందిని కమాండెంట్ అభినందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ టి.పాణి, ఆర్‌ఐలు రాజు, వెంకటేశ్వర్లు, ఆర్బీ సింగ్, రాజారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు...

గణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన పలువురు అధికారులు, సిబ్బంది, పోలీసు అధికారులు, పోలీసులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. - వనపర్తి


ప్రశంసాపత్రం అందుకుంటున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్


జి.వెంకటేశ్వర్లు (రెవెన్యూ అదనపు కలెక్టర్) | రావుల గిరిధర్ (ఎస్పీ) | ఉమాదేవి (డీఆర్డీఓ) | గోవింద్‌నాయక్ (డీఏఓ)


సుధీర్‌రెడ్డి (డీవైఎస్‌ఓ) | మల్లికార్జున్ (ఈడి, ఎస్సీ కార్పొరేషన్) | సుబ్రమణ్యం (ఆర్డీఓ) | వెంకటేశ్వర్లు (తహసీల్దార్, కొత్తకోట)


లక్ష్మి (తహసీల్దార్, రేవల్లి) | లక్ష్మీకాంత్ (డిప్యూటీ తహసీల్దార్, పెబ్బేరు) | ఇషాన్ (డీఎస్‌ఓ కార్యాలయం) | భానుప్రకాష్ (ఏఓ, కలెక్టరేట్) | కిషన్ (సి-సెక్షన్, కలెక్టరేట్) | సునీత (ఈ-సెక్షన్, కలెక్టరేట్) | శ్రీకాంత్‌రావు (కలెక్టరేట్) | కిరణ్‌కుమార్‌రెడ్డి (కలెక్టర్ సీసీ)


సురేష్ (సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్) | రవి (డ్రైవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్) | రాజు (స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సీసీ) | చిన్న (డ్రైవర్, సంస్థల అదనపు కలెక్టర్ సీసీ) | మూర్తి (డ్రైవర్, కలెక్టర్) | సుభాష్ (ఏపీఆర్వో) | వినోద్ (ఫొటోగ్రాఫర్, డీపీఆర్వో కార్యాలయం) | రాంబాబు (సీఐ, కొత్తకోట)


శివకుమార్ (సీఐ, ఆత్మకూర్) | శ్రీనివాస్ (రిజర్వ్ ఇన్‌స్పెక్టర్) | శేఖర్‌రెడ్డి (ఎస్సై, మదనాపురం) | ఎండి అంజద్ (ఎస్సై, షీ టీం) | ఎండి. మొగ్దుం (ఎస్సై, రిజర్వ్ విభాగం) | వినోద్‌కుమార్ (సీనియర్ అసిస్టెంట్, ఎస్పీ కార్యాలయం) | రవికుమార్ (జూనియర్ అసిస్టెంట్, ఎస్పీ కార్యాలయం) | విజయభాస్కర్ (ఎస్టీ కానిస్టేబుల్)


హర్షవర్ధన్‌రెడ్డి (ఎస్టీ కానిస్టేబుల్) | భూదేవి (కంట్రోల్ రూం, ఎస్పీ కార్యాలయం) | మురళీకృష్ణ (ఐటీ సెల్, ఎస్పీ కార్యాలయం) | ఈశ్వరయ్య (కానిస్టేబుల్, డీసీఆర్బీ) | శ్రీశైలంచారి, (కానిస్టేబుల్, వనపర్తి రూరల్ పీఎస్) | మహేందర్‌గౌడ్ (కానిస్టేబుల్, చిన్నంబావి పీఎస్) | లింగం (కానిస్టేబుల్, ఖిల్లాఘనపురం పీఎస్) | విష్ణువర్ధన్ (కానిస్టేబుల్, శ్రీరంగాపూర్ పీఎస్) | సురేందర్‌గౌడ్ (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్)

బెబ్బులికి పూర్వవైభవం



సాక్షి ఎఫెక్ట్..

శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూరు ప్రధాన కూడలిలోని ఫారెస్టు డివిజనల్ ఆఫీస్ ఎదుట ఏర్పాటు చేసిన పెద్ద పులుల బొమ్మలు ఎట్టకేలకు పూర్వవైభవం సంతరించుకున్నాయి. గత కొన్నాళ్లుగా ఇక్కడి పెద్ద పులుల బొమ్మలు రంగులు వెరసి కళావిహీనంగా మారిన వైనంపై ఈ నెల 23న 'సాక్షి' దినపత్రికలో 'లక్ష్యం నెరవేరిందో.. నిర్లక్ష్యం ఆవహించిందో' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన అటవీ శాఖ అధికారులు పెద్ద పులుల బొమ్మలకు రంగులు వేశారు. దీంతో ఆదివారం గణతంత్ర వేడుకలకు వచ్చిన వారికి నిజమైన పెద్ద పులులా కనిపించి ఆశ్చర్యపర్చాయి. - మన్ననూర్

గజ వాహనంపై అభయాంజనేయుడు



ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్నారు. రెండోరోజు ఆదివారం ఉదయం అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గజవాహన సేవ నిర్వహించారు. భక్తుల భజనల నడుమ స్వామివారు గజ వాహనంపై ఊరేగారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు శివస్వాములు పాల్గొన్నారు.

కాల్వకు గండి..



మల్దకల్: మండలంలోని చర్లగార్లపాడు శివారులో 106 ప్యాకేజీ కాల్వకు ఆదివారం గండి పడటంతో పంటలు నీట మునిగాయి. నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగంగా ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి వచ్చే ప్రధాన కాల్వ షట్టర్‌ను కొందరు రైతులు మూసివేయడంతో నాగర్‌దొడ్డి, కుర్తిరావులచెర్వు మీదుగా తూంకుంటకు వెళ్లే కాల్వలో నీటి ఉధృతి పెరగడంతో పాటు కాల్వలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో కాల్వ తెగిపోయింది. నీరంతా పంట పొలాల్లోకి చేరడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే నీటి సరఫరాను నిలిపి వేశారు. మొత్తం 25 ఎకరాల్లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, వేరుశనగ, ఉల్లి, పొగాకు పంటలు దెబ్బతిన్నట్లు రైతులు సుధాకర్, ధర్మన్న, నాగరాజు, ప్రేమ్‌రాజ్, ప్రసాద్, కర్రెన్న, బుడ్డన్న, వెంకటన్న తెలిపారు. నష్ట పరిహారం అందించడంతో పాటు కాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


శేఖర్ (ఫైల్)

పాన్‌గల్: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని గోప్లాపూర్‌కి చెందిన శేఖర్(20) ఈనెల 16న వనపర్తి మండలం మెట్‌పల్లి దగ్గర రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో గాయపడ్డాడు. హైదరాబాద్ ఆస్పత్రిలో పది రోజుల నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న కుమారుడు అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.